సాక్షి కర్నూలు

ఆదివారం । 26 । నవంబర్ । 2023




హంద్రీనదికి చేరిన జీడీపీ నీరు

కోడుమూరు రూరల్: కోడుమూరులో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి వదిలిన నీరు శనివారం హంద్రీ నదిలోని మంచినీటి పథకాలకు చేరింది.



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: కార్తీకమాసోత్సవాల్లో శ్రీశైల దేవస్థానం కళావేదికపై శనివారం విశాఖ పట్నం చెందిన నాగచందన, చందన డాన్స్ అకాడమీ ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది.



ఆకలి గుర్తు చేస్తూ..

రండి.. దయచేయండి అంటూ భోజన ప్రియులను కర్నూలులో రెస్టారెంట్‌లు ఆహ్వానం పలుకుతున్నాయి. వినూత్న వసతుల మధ్య రుచులను ఆస్వాదిస్తూ సరికొత్త అనుభూతిని పొందుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

శ్రీమఠంలో భక్తుల రద్దీ



శ్రీమఠం కారిడార్‌లో భక్తజన సందోహం

మంత్రాలయం: ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో భక్తుల రద్దీ నెలకొంది. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో రాఘవేంద్రుల మూల బృందావన దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. భక్తులు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకుని రాయరు బృందావన దర్శనం చేసుకున్నారు. అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం, పంచామృతం క్యూలు భక్తులతో కిటకిట లాడాయి.

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా ఈ సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆర్‌యూ ఇన్‌చార్జి వీసీ బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఫజుల్ రహమాన్‌ను అభినందిస్తున్న ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ డాక్టర్ ఫజుల్ రహమాన్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆనందరావు పదవీ కాలంలో నవంబర్ 24వ తేదీతో ముగియడంతో ఆయన స్థానంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ వీసీ ఫజుల్‌రహమాన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం తెలిసిందే. ఆ మేరకు ఆయన ఆర్‌యూ పరిపాలన భవన సముదాయంలోని వైస్ చాన్స్‌లర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సీ సందర్భంగా ఆయనకు రిజిస్ట్రార్ వెంకటసుందరానంద పుచ్చ, ప్రొఫెసర్లు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలాఉంటే వీసీగా ఉన్న ప్రొఫెసర్ ఆనందరావు పదవీ కాలం ముగియడంతో పీడా పోయిందంటూ వర్సిటీ ఏడీ బిల్డింగ్, మెయిన్ ఎంట్రెన్స్ దగ్గర గుమ్మడి కాయలతో దిష్టి తీయడం విమర్శలకు తావిస్తోంది.

29న టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు భూమి పూజ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 29న వర్చువల్ మోడ్‌లో భూమి పూజ నిర్వహించనున్నారు. పత్తికొండ సమీపంలోని 3.60 ఎకరాల్లో టమాట ప్రాసెసింగ్ యూనిట్‌ను రూ.12.05 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 27న భూమి పూజ కార్యక్రమం ఉండగా.. 29వ తేదీకి వాయిదా పడింది. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవతో సమీకృత టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కేటాయించిన భూమిని ప్రభుత్వం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి అడ్వాన్స్ పొజిషన్ కూడా ఇవ్వడం విశేషం.

మూగవేదన లేదిక!

- పశు సంరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత
- నియోజక వర్గాల వారీగా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు
- ఎక్కడికక్కడే వైద్య సేవలు
- పశువులు, గొర్రెల్లో తగ్గిన మరణాల రేటు
- ప్రయోగశాలలకు అధునాతన పరికరాల సరఫరా
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 60,411 శ్యాంపిల్స్‌కు పరీక్షలు.. వ్యాధుల నిర్ధారణ
- ఎనిమిది ల్యాబ్‌లకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ గుర్తింపు

నోరులేని మూగజీవాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చింది. నియోజక వర్గాల వారీగా వ్యాధి నిర్ధారణ ల్యాబ్‌ల ఏర్పాటుతో పాటు వైఎస్ఆర్ వెటర్నరీ మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లను కూడా అందుబాటులోకి తెచ్చింది. దీంతో మూగజీవాలకు వ్యాధులు నిర్ధారణతో పాటు వైద్యం సత్వరం లభిస్తుండటంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో వాటి మరణాల రేటు గణనీయంగా తగ్గింది.



పశువులకు వైద్య సేవలు అందిస్తున్న పశువైద్యులు



కర్నూలులోని జిల్లా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

ఉమ్మడి జిల్లాలోని పశుసంపద వివరాలు

తెల్ల జాతి పశువులు	3,56,541
నల్ల జాతి పశువులు	4,20,882
గొర్రెలు	19,85,868
మేకలు	6,10,669
కోళ్లు	12,89,417

కర్నూలు(అగ్రికల్చర్): 2018–19 వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పశువులు అనారోగ్యాలకు గురైతే గుడ్డిగా వైద్యం చేసేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే నాడు పశువైద్యం దైవాధీనం. నేడు పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఎప్పుడూ లేని విధంగా నియోజక వర్గాల వారీగా డాక్టర్ వైఎస్ఆర్ పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిల్లో పశువులకు సోకుతున్న వ్యాధులను నిర్ధారించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇంతకు ముందు ఉమ్మడి జిల్లాకు కర్నూలులోని బహుళార్థ పశువైద్యశాల ప్రాగంణంలో జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం మాత్రమే ఉండేది. పశువులకు జబ్బులొచ్చినప్పుడు నిర్ధారణకు శ్యాంపిల్స్‌ను కర్నూలుకు మాత్రమే పంపాలి. ఇందువల్ల మూగజీవాలకు మెరుగైన వైద్యం అందించడంలో జాప్యం జరిగి మరణాలు సంభవించేవి. నేడు జిల్లాలో ఎక్కడికక్కడే పశువ్యాధులను నిర్ధారించి వైద్య సేవలు అందించడం ద్వారా మరణాలు గణనీయంగా తగ్గాయి.

ఉమ్మడి జిల్లాలో 60,411 శ్యాంపిల్స్‌కు పరీక్షలు

వివిధ సమస్యలపైన రైతులు తమ పశువులను చికిత్స నిమిత్తం పశువైద్యశాలలకు తరలిస్తారు. సాధారణ సమస్యలుగా వైద్యులు భావిస్తే మందులు ఇచ్చి పంపిస్తారు. ఏదైనా సమస్య ఉన్నట్లు అనుమానం వస్తే దానికి సంబంధించిన రక్తం లేదా పేడ లేదా మూత్రం శ్యాంపిల్స్ తీసి సమీపంలోని పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలకు పంపుతారు. జిల్లాలో 14 పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఉన్నాయి. వీటిని 2021 ఏప్రిల్‌లో ప్రారంభించారు.ప్రతి ల్యాబ్‌లో క్వాలిఫైడ్ ల్యాబ్ టెక్నీషియన్‌లు ఉంటారు. నియోజక వర్గాల వారీగా ఏర్పాటు అయిన ల్యాబ్‌లను ఆయా ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్ సహాయ సంచాలకులు పర్యవేక్షిస్తారు. జిల్లా కేంద్రమైన కర్నూలులో జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఉండగా... ఆదోని, ఆలూరు, గూడూరు, మంత్రాలయం, పత్తికొండ, ఎమ్మిగనూరుల్లో నియోజక వర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు 28,558 శ్యాంపిల్స్‌కు పరీక్షలు నిర్వహించి జబ్బులను నిర్ధారించారు. నంద్యాల జిల్లాలో పాణ్యం, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్, నంద్యాల, బనగానపల్లెలో పశు వ్యాధి నిర్ధారణ ల్యాబ్‌లు ఉన్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు 31,853 శ్యాంపిల్స్‌కు పరీక్షలు నిర్వహించి వ్యాధులను నిర్ధారించి ఖచ్చితమైన వైద్యసేవలు అందించే అవకాశం కల్పించారు. ప్రతి కేంద్రానికి అవసరమైన ఎక్విప్‌మెంట్ కూడా సరఫరా కావడం విశేషం.

8 ల్యాబ్‌లకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ గుర్తింపు

మూగజీవాలకు సత్వర వైద్య సేవలు అందిస్తుండటంతో జిల్లాలో ఎనిమిది వైఎస్ఆర్ నియోజకవర్గం స్థాయి పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్(ఐఎస్ఓ) గుర్తింపు లభించింది. ఇందులో కర్నూలు, ఆలూరు, పత్తికొండ, ఆదోని, ఆళ్లగడ్డ, డోన్, మంత్రాలయం, నంద్యాల పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఉన్నాయి. ఈ ప్రయోగశాలలను ఐఎస్ఓ ప్రతినిధుల బృందం జిల్లా మూడు సార్లు పర్యటించి పశువ్యాధి నిర్ధారణ కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న పరీక్షల నాణ్యత, పరీక్షల నిర్వహణకు అవసరమైన ల్యాబ్, ఎక్విప్‌మెంటు తదితర వాటిని పరిశీలించి సంతృప్తి చెంది ఐఎస్ఓ సర్టిఫికెట్‌లు (ఐఎస్ఓ 9001:2015) జారీ చేసింది.



వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న దృశ్యం

ల్యాబ్‌ల్లో నిర్వహించే పరీక్షలు

పశువ్యాధి నిర్ధారణ కేంద్రాల్లో అన్ని రకాల పశు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకు అవసరమైన అధునాతన ఎక్విప్‌మెంట్‌తో పాటు కెమికల్స్ ఎటువంటి కొరత లేకుండా ప్రభుత్వం సరఫరా చేస్తోంది. మైక్రోస్కోపు, బయోకెమికల్స్ అనలైజర్, ఇంకుబేటర్, లామినార్ ఎయిర్ ఫ్లో, హాట్ ఎయిర్ ఓవెన్ వంటి అధునాతన వైద్య పరికరాలు కూడా ఉన్నాయి. రక్త, మూత్ర, పేడ, సీరం పరీక్షలు, లవణాల శాతం నిర్ధారణ, కాలేయ పరీక్షలు, మూత్రపిండ పరీక్షలు, పొదుగువాపు, చర్మానికి సంబంధించిన వ్యాధులకు సంబంధించిన పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. పశువులు, జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తే... టీకా మందు ఏ స్థాయిలో పని చేస్తుందనే దానిని కూడా నిర్ధారిస్తారు. పశువులు మరణిస్తే ఏ విధంగా, ఏ కారణాలతో మరణించాయో కూడా పోస్టుమార్టం ద్వారా తెలియజేస్తారు. అలాగే జిల్లా కేంద్రంలోని పశువ్యాధి నిర్ధారణ కేంద్రంలో రూ.21 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అగ్రి అనలైజర్ యంత్రం ద్వారా సైలేజీలో ఉన్న పోషకాల శాతాలను నిర్ధారిస్తారు.

పారదర్శకంగా పశు వ్యాధుల నిర్ధారణ

పశుసంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం నియోజక వర్గాల వారీగా పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటికి క్వాలిఫైడ్ ల్యాబ్ టెక్నీషియన్స్‌ను నియమించడంతో పాటు అవసరమైన ఎక్విప్‌మెంటు మొత్తం వచ్చింది. ఇవి 2021 ఏప్రిల్ నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటి వరకు 60411 శ్యాంపిల్స్‌ను పరీక్షించి వ్యాధులను నిర్ధారించాము. అలాగే సకాలంలో వైద్య సేవలు అందించడం వల్ల పశువుల మరణాల రేటు తగ్గించగలిగాం.

– రవిబాబు, అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం

జిల్లాకు రూ.403 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అవసరం

కర్నూలు(అగ్రికల్చర్): కరువు రైతులను ఆదుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలో కర్నూలు రూరల్, తుగ్గలి మండలాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాలను ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించింది. సవరించిన స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు నివేదికలు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు దాదాపు రూ.403 కోట్లు విడుదల చేయాలని జిల్లా యంత్రాంగం నివేదిక సిద్ధం చేసింది. కర్నూలు సబ్ డివిజన్‌లో కర్నూలు అర్బన్ మండలంతో పాటు కల్లూరు, కోడుమూరు, గూడూరు, సీ.బెళగల్, ఓర్వకల్ మండలాలకు సంబంధించి 62,829 మంది రైతులకు 41,087 హెక్టార్లకు సంబంధించి రూ.59.35 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని నివేదిక సిద్ధం చేస్తున్నట్లు ఏడీఏ సాలురెడ్డి తెలిపారు. అత్యధికంగా పత్తి పంటకు సంబంధించి 31,120 మంది రైతులకు రూ.38.76 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమవుతోంది.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

- 2047లోపు అభివృద్ధి చెందిన దేశంగా భారత్
- వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో కలెక్టర్ డాక్టర్ జి. సృజన

గోనెగండ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. మన దేశం అన్ని రంగాల్లో దూసుకెళ్తుందని, 2047లోపు అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని చెప్పారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ఉద్దేశం కూడా అదేనన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిపి, వాటిని అందించేందుకు ఈనెల 25 నుంచి వచ్చే ఏడాది జనవరి 26 వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 17 రకాల పథకాలను పేదల కోసం ప్రవేశపెట్టిందని, వాటిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. అంతకు ముందు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలల విద్యార్థునులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీఈఓ రంగారెడ్డి, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీపీ నసురుద్దీన్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్, సర్పంచ్ హైమవతి, బందెనవాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జొన్నగిరిలో వజ్రం లభ్యం

తుగ్గలి: మండలంలోని జొన్నగిరిలో కంది పంట చూసేందుకు పొలానికి వెళ్లిన ఓ సన్నకారు రైతుకు శనివారం వజ్రం లభ్యమైనట్లు సమాచారం. ఈ వజ్రాన్ని ఓ వ్యాపారి రూ.5లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో తొలకరి వర్షాలకే కాకుండా అన్ని సీజన్‌లలో విలువైన వజ్రాలు లభ్యమవుతుంటాయి. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వజ్రాన్వేషణకు జనం వస్తున్నారు. వజ్రాన్వేషకుల తాకిడితో పంటలు పాడవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

వెబ్‌సైట్‌లో స్టాఫ్‌నర్సు పోస్టుల మెరిట్ జాబితా

కర్నూలు(హాస్పిటల్): ఎస్ఎన్‌సీయు/ఎన్‌బీసీయులో స్టాఫ్‌నర్సుల పోస్టుల భర్తీకి సంబంధించి మెరిట్ జాబితాను వెబ్‌సైట్ kurnool.ap.gov.inలో ఉంచినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మెరిట్‌జాబితాను సరిచూసుకోవాలని సూచించారు.

ఉద్యోగాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటల్స్, నర్సింగ్ కళాశాలల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీని ఈ నెల 29 వరకు పొడిగించినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 370 పోస్టుల భర్తీకి ఈ నెల 27వ తేది వరకు గడువు ఉండేదని, బ్యాంకులకు రెండు రోజులు శని వారం, ఆదివారం వరుసగా సెలవులు కావడం వల్ల అభ్యర్థులు డీడీలు తీసేందుకు తగిన సమయం లేనందున దరఖాస్తుల స్వీకరణకు మరో రెండు రోజులు పొడిగించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 29వ తేది సాయంత్రం 5 గంటల్లోపు తన కార్యాలయంలో అందజేయాలన్నారు.

లోక్ అదాలత్ కార్యాలయం సందర్శన



రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి భబితకు మొక్క అందజేస్తున్న ఎస్పీ కృష్ణ కాంత్

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని ఆ సంస్థ రాష్ట్ర సభ్య కార్యదర్శి ఎం.భబిత శనివారం సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులు పరిశీలించి కర్నూలు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎస్.శ్రీనివాసరావు, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీఎస్ శ్రీనివాసరావును అడిగి కేసుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్యానల్ న్యాయ వాదులతో మాట్లాడారు. కేసుల సత్వర పరిష్కారానికి సహకరిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్‌ను ఈ సందర్భంగా అభినందించారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం న్యాయమూర్తులతో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా సబ్‌జైలులో ఉన్న ఖైదీలకు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకోడానికి వీల్‌చైర్లను జైలు పర్యవేక్షణాధికారికి అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు భూపాల్ రెడ్డి, మల్లేశ్వరి, దివాకర్, జ్యోష్నాదేవి, కల్యాణి, వందన, బాల నేరస్తుల వసతి గృహ పర్యవేక్షణ అధికారి హుసేన్ బాషా, ఆయా శాఖల జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పేద పిల్లల ఉన్నత చదువులకు కృషి



సదస్సులో మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ డా.సంజీవ్‌కుమార్

- ఎంపీ సంజీవ్‌కుమార్

కర్నూలు సిటీ: పేదల పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాల ద్వారా కృషి చేస్తున్నారని కర్నూలు పార్లమెంటు సభ్యులు డా.సంజీవ్‌కుమార్ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో విద్యార్థుల సాధికారత జగనన్నతోనే సాధ్యం అనే సదస్సు నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఎంపీతో పాటు జగనన్న సచివాలయ జిల్లా కన్వీనర్ తెర్నేకల్లు సురేందర్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి హనుమంత్ రెడ్డి, బీసీ విభాగం నాయకుడు గడ్డం రామకృష్ణ పాల్గొని ప్రసంగించారు. పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారన్నారు. విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న వైఎస్ జగన్‌కు యువత అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బీసీ విభాగం నాయకులు ధనుంజయ ఆచారి, రిటైర్డ్ తహసీల్దారు రోషన్ అలీ, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.వెంకట్ రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మణిరెడ్డి, 20వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీరెడ్డి, నాయకులు సంతోష్, మధుసూదన్, అరుణ్, దీపక్, ధీరజ్, ఆర్‌యూ విభాగం నాయకులు అఖిల్, సిద్ధార్థ్, రాజావర్ధన్, చంటి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంగమేశ్వరానికి భక్తుల తాకిడి



సంగమేశ్వరుడిని దర్శించుకునేందుకు నీటిలో నడిచి వెళ్తున్న భక్తులు

కొత్తపల్లి: ప్రాచీన సంగమేశ్వరాలయం జలాధివాసం నుంచి బయల్పడంతో భక్తుల తాకిడి మొదలైంది. కార్తీకమాసం కావడంతో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 839 అడుగులకు చేరుకొంది. దీంతో ప్రాచీన ఆలయప్రాకారంలో, గర్భాలయంలో రెండు అడుగుల నీరు ఉండడంతో నీటిలోనే భక్తులు సంగమేశ్వరుడికి భక్తితో పూజలు చేసుకుంటున్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

దేవనకొండ: మండల పరిధిలోని మాచాపురం గ్రామం పాఠశాల ఉపాధ్యాయుడు గణేష్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ–2 నిర్మలాదేవి తెలిపారు. విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు అందడంతో విచారణ జరిపి పై చర్యలు తీసుకున్నట్లు శనివారం ఆమె విలేకరులకు వెల్లడించారు.

డోన్ టీడీపీలో విమర్శల వార్

డోన్: ఇప్పటికే ప్రజాదరణ లేని తెలుగు దేశం పార్టీలో నాయకుల మధ్య అంతర్గత పోరు తారా స్థాయికి చేరుకుంటోంది. ఇటీవల వరుస సంఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలిచాయి. 40 ఏళ్లుగా పార్టీకి సేవలు చేసిన తమను సంప్రదించకుండానే డోన్ నియోజకవర్గానికి పార్టీ ఇన్‌చార్జ్‌గా ధర్మవరం సుబ్బారెడ్డి పేరును ప్రకటించడం పెద్ద తప్పిదమని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ ఇటీవల తన జన్మదిన వేడుకల్లో అధినేత చంద్రబాబును తీరును తప్పుబట్టారు. దీంతో కేఈ ప్రకటన ఇచ్చిన మరునాడే నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ డోన్‌కు వచ్చి టీడీపీ ఇన్‌చార్జ్‌గా ధర్మవరం సుబ్బారెడ్డే కొనసాగుతారని, అది పార్టీ నిర్ణయమని తేల్చిచెప్పారు. ఈ విషయంలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే పార్టీ అధిష్టానంతో సంప్రదింపులు చేయాలే తప్పా పత్రికలకు ఎక్కరాదని ఆయన పరోక్షంగా కేఈ ప్రభాకర్‌తో పాటు ఆయన వర్గీయులను తీవ్రంగా హెచ్చరించారు. మల్లెల రాజశేఖర్‌తో ప్రెస్‌మీట్ నిర్వహించిన వారిపై సోషల్‌మీడియాలో కేఈ వర్గీయులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. వీరిలో ఏ ఒక్కరు కూడా వారి గ్రామాల్లో సర్పంచుగా గెలవలేని దద్దమ్మలని దుమ్మెత్తిపోశారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే వీరిని ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని కేఈ వర్గీయులు ఘాటు విమర్శలు చేశారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఇచ్చే ప్యాకేజీ కోసం ఆశపడి ఇక్కడ ఇన్‌చార్జ్‌ను నియమించారని గుమ్మకొండ సర్పంచ్ దశరథ రామిరెడ్డి ఆరోపించారు. ఏ ఒక్కరితో సంప్రదించకుండా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ధర్మవరం సుబ్బారెడ్డిని ఎలా నియమిస్తారని చంద్రబాబుతో పాటు ఆయన తనయుడు లోకేష్‌పై కూడా కేఈ వర్గీయులు సోషల్ మీడియాలో దుమ్మెత్తి పోస్తున్నారు. మరోసారి మల్లెల రాజశేఖర్ ప్రెస్‌మీట్ నిర్వహించడానికి డోన్‌కు వస్తే అడుగు పెట్టనివ్వమని కేఈ వర్గీయులు తీవ్రస్థాయిలో హెచ్చరిస్తున్నారు.

సండే స్పెషల్

ఆకలి గుర్తుచేస్తూ.. సంతృప్తి మిగులుస్తూ!

రుచికరమైన 'రెస్టారెంట్‌లు'
- భోజనప్రియులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు
- సరికొత్త వంటకాలతో ఆహ్వానం
- ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ నిర్వహణ
- సాయంత్రం వేళ ప్రత్యేక ఆకర్షణగా బిగ్ స్క్రీన్
- ప్రత్యేక అనుభూతినిస్తున్న ఖానాఖజానా

ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు ఎలాంటి పని మీద కర్నూలుకు వచ్చి టిఫిన్ తినాలనుకున్నా, మధ్యాహ్నం ఆకలి తీర్చుకోవాలన్నా.. రాత్రికి నాలుగు మెతుకులు గొంతు దిగాలన్నా ముందుగా గుర్తుకొచ్చే పేర్లు అజంతా, గోపి, హిందుస్తాన్, రమా దర్శన్, గీతా లంచ్‌హోం, అమరావతి.. తరహా పదుల సంఖ్యలో హోటళ్లు మాత్రమే. అప్పటి జనాభాకు అనుగుణంగా ఈ హోటళ్లు ఎంతో రుచికరమైన అల్పాహారంతో పాటు షడ్రుచులను అందించి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నాయి. ఇందులో కొన్ని హోటళ్లు మారిన కాలంతో పాటు భోజన ప్రియుల అభిరుచులకు అనుగుణంగా మార్పులు చేసుకొని ఇప్పటికీ ఉనికి చాటుకుంటున్నాయి. అయితే నగరం వేగంగా విస్తరించడంతో పాటు నాలుక భిన్న ఆహారాన్ని కోరుకోవడంతో అందుకు అనుగుణంగా హోటళ్లు వెలుస్తూ వచ్చాయి. ఇప్పుడు నగరంలోనే కాదు శివారు ప్రాంతాల్లోనూ భారీ రెస్టారెంట్లు స్వాగతం పలుకుతున్నాయి. జాతీయ రహదారుల్లో దారి పొడవునా ఆకలి తీర్చే ఘుమఘుమలు వాహనాలు ముందుకు కదలనివ్వవంటే అతిశయోక్తి కాదు. – సాక్షి, కర్నూలు డెస్క్



చిట్టిముత్యాల బిర్యాని | రాగిముద్ద | మటన్ కడ్డీలు | మండీ బిర్యానీ

☛ కేరళ ఆపం: నగర శివారులోని ఓ చిన్న దుకాణంలో ఏర్పాటు చేసిన హోటల్ ఇటీవల కాలంలో తమ ప్రత్యేకతను చాటుకుంటోంది. కేరళవాసులకే పరిమితమైన ఆపం ఇప్పుడు ఇక్కడ లభిస్తుంది. డిగ్రీ పూర్తి చేసిన ఇద్దరు అన్నదమ్ములు ఈ హోటల్ నిర్వహిస్తున్నారు. స్వయంగా వీరిద్దరే ఆపం తయారు చేస్తూ చెట్నీతో పాటు నాన్ వెజ్‌తోనూ అందిస్తున్నారు. కొత్త వంటకాలకు ఎప్పుడూ ఆదరణ లభిస్తుందనేందుకు వీరి వినూత్న ఆలోచనే నిదర్శనం.



☛ కోకోనట్ జ్యూస్: ఇప్పటి వరకు టెంకాయ నీళ్లను మాత్రమే తాగిన వాళ్లకు.. ఈ దుకాణానికి వస్తే సరికొత్త రుచి లభిస్తుంది. బయట ఒక టెంకాయ కొనుగోలు చేయాలంటే రూ.50 తీసుకుంటున్నారు. ఇదే ధరతో ఇక్కడ కోకోనట్ జ్యూస్ లభిస్తుంది. ఇందులో టెంకాయ నీళ్లకు తోడు అందులోని కొబ్బరి, గ్లూకోస్, కాస్త చక్కెరను మిక్సీలో వేసి జ్యూస్‌ను సిద్ధం చేస్తున్నారు. దీనికి అదనంగా ఫ్లేవర్ కోరుకునే వాళ్లకు మరో రూ.10 అదనంగా తీసుకొని సీజన్‌కు అనుగుణంగా లభించే పండ్లతో కూడిన కోకోనట్ జ్యూస్‌తో ఆకట్టుకుంటున్నారు.





వేడివేడి కుండ బిర్యానీ

ఒక్క పూటైనా కలిసి మెలసి భోజనం

నగర వాతావరణానికి అలవాటుపడిన చాలా కుటుంబాలు, భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులు కావడంతో ఇటీవల కాలంలో ఇంట్లో వంట చేసుకోవడం చాలా వరకు తగ్గిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉరుకులు పరుగుల జీవితం నుంచి కాస్త ఊరట పొందేందుకు, ఇంటిల్లిపాదీ కలసి భోజనం చేసేందుకు అనువుగా హోటళ్లు ఏర్పాటయ్యాయి. ఇక ఇటీవల నగరంలోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో బ్రిడ్జి కింద రూపుదిద్దుకున్న ఖానా ఖజానా ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో ఆకలి తీరుస్తోంది. సాయంత్రం వేళ వెలుగుజిలుగుల మధ్య ఇక్కడి అల్పాహార.. వెజ్, నాన్ వెజ్ ఆహారం తియ్యని అనుభూతి మిగులుస్తోంది. అదేవిధంగా ఇంకాస్త ప్రయాణం చేసి ఊరి బయటకు వెళ్లాలనుకునే వారికి, సమయం వెచ్చించాలనుకుంటే అందుకు అనువైన హోటళ్లు కూడా రారమ్మని ఆహ్వానిస్తుండటం విశేషం.

సరికొత్త రుచులు

ఒకప్పుడు హోటళ్లకు వెళితే ఇడ్లీ, వడ, దోశ.. మధ్యాహ్నమైతే అరిటాకులో వడ్డించే భోజనం.. రాత్రికి వీటితో పాటు చపాతి, పరోటా అదనం. మాంసాహార ప్రియులకు బిర్యానీ ఉండనే ఉంటుంది. ఇప్పుడు వీటితో పాటు సరికొత్త రుచులు భోజన ప్రియులను హోటళ్ల వైపునకు కాళ్లు కదిపేలా చేస్తున్నాయి. రకరకాల బిర్యానీలతో పాటు హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, చెన్నై తదితర మహానగరాల్లో లభించే అన్నిరకాల వంటకాలు దాదాపుగా ఇక్కడ లభ్యమవుతున్నాయి. కేఎఫ్‌సీ, బార్బీక్యూ, ఇంకా ఎన్నో ఇప్పుడు నగరంలోనే అడుగడుగునా కనిపిస్తున్నాయి. ఇప్పటికీ పాతబస్టాండ్ ప్రాంతంలో నెయ్యి దోశ నోరూరిస్తుంది.

రకరకాల వంటకాలు

దాదాపుగా ప్రతి హోటల్‌లో వెజ్, నాన్ వెజ్ భోజనాలు లభిస్తున్నా.. ఒక్కొక్కరు ఒక్కో ప్రత్యేకతను సొంతం చేసుకుంటున్నారు. ఒకచోట కుండ బిర్యానీ, మరోచోట చిట్టి ముత్యాల బిర్యానీ, మరోచోట రాగిముద్ద తలకాయ కూర.. ఇంకోచోట నెల్లూరు చేపల పులుసు.. ఇక మటన్ కడ్డీలు నోరూరిస్తుంటాయి. ఇటీవల కాలంలో మండీ భోజనం నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఒక భారీ ప్లేట్‌లో ఇంటిల్లిపాదీ భోజనం చేసే సదుపాయం ఉండటం సరికొత్త అనుభూతిని పంచుతోంది. అదేవిధంగా బకెట్ బిర్యానీ ప్యాకింగ్‌లోనూ వినూత్న పంథాకు అద్దం పడుతోంది. ఒకరు.. ఇద్దరు.. నలుగురు.. ఆరుగురు.. పది మంది వరకు తినేలా ఈ బకెట్ బిర్యానీలను సిద్ధం చేస్తున్నారు.



బకెట్ బిర్యానీ



శివారులో వినూత్న హోటళ్లు

జాతీయ రహదారుల వెంట వెలసిన హోటళ్లు భోజన ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రయాణికులతో పాటు నగరవాసులు సైతం ఈ హోటళ్లకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు అనుగుణంగానే ఆయా హోటళ్లలో బిగ్ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి సినిమాలు, పాటలను ప్రదర్శిస్తున్నారు. ఇక క్రికెట్ మ్యాచ్‌లు ఉంటే.. ఆ రోజుల్లో సందడే సందడి. ముందుగానే టేబుళ్లు బుక్ చేసుకొని మరీ ఈ రెస్టారెంట్లకు క్యూకడుతున్నారు. ఒక హోటల్ ఎదుట ఏర్పాటు చేసిన ఏనుగు అటు ఇటూ కదులుతూ, పిల్లలకు సరికొత్త అనుభూతిని మిగులుస్తున్నాయి. అసలైన ఏనుగునే ఇలా నిల్చోబెట్టారా అనే భావన కలిగించే రీతిలో నిర్వాహకులు ఈ సెట్టింగ్‌ను ఏర్పాటు చేశారు. ఓ యజమాని ఇంకాస్త ముందుకెళ్లి ఏకంగా విమానాన్నే హోటల్‌గా మారుస్తున్న తీరు చూస్తే ఈ రంగం ఏస్థాయిలో విస్తరిస్తుందో అర్థమవుతోంది.

"చిట్టిముత్యాల బిర్యానీ ఎంతో రుచి



వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. అలా కర్నూలుకు వచ్చిన ప్రతీసారి నగర శివారులోని రెస్టారెంట్‌లో చిట్టిముత్యాల బిర్యానీ తినడం అలవాటుగా మారింది. శివారు ప్రాంతం కావడంతో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. వాహనాల పార్కింగ్‌కు అనువుగా ఉండటంతో వీలైనంత వరకు ఇలాంటి హోటళ్లకే వెళ్తుంటా.

– వెంకటేశ్వర్లు, నెల్లూరు జిల్లా



నోరూరించే రాగి దోశ

ఆరోగ్యానికి అనువుగా..

పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం విచ్చలవిడిగా పెరిగిపోవడంతో వ్యాధుల తీవ్రత కూడా అదేస్థాయిలో ఉంటోంది. చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, క్యాన్సర్ మహమ్మారి ఉక్కిరిబిక్కిరి చేస్తుండటంతో ఆ రోగాల నుంచి బయటపడేందుకు జేబుకు చిల్లు పెట్టుకోక తప్పనిపరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఆహార అలవాట్లలో మార్పు చేసుకుంటున్నారు. తద్వారా కొద్ది వరకైనా అనారోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చనే భావన కనిపిస్తోంది. ఇందుకు అనుగుణంగా నగరంలో పలుచోట్ల మిల్లెట్ హోటళ్లు కూడా ఏర్పాటయ్యాయి. చిరుధాన్యాలతో తయారు చేసిన ఇడ్లీ, దోశ, పూరీలు ఆరోగ్యాన్ని పంచుతున్నాయి. ఇదే సమయంలో రాగి సంకటితో పాటు జొన్నరెట్టె కూడా కడుపును చల్లబరుస్తూ బలాన్ని చేకూరుస్తుండటం విశేషం.

వైద్యరంగంలో ఎన్నో సంస్కరణలు

- 50 వేల పోస్టుల భర్తీ
- గ్రామీణ స్థాయి నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు అభివృద్ధి
- ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
- ఘనంగా కర్నూలు మెడికల్ కాలేజీ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైద్యాధికారులు

కర్నూలు(హాస్పిటల్): వైద్యరంగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు చేపట్టిందని ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీలో శనివారం సాయంత్రం నిర్వహించిన కాలేజీ డేకే ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రం చెప్పిన దానికంటే ఎక్కువగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశామన్నారు. కోవిడ్ మహమ్మారి వచ్చినా వెరవకుండా రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేసిందన్నారు. పాతకాలం నాటి విధానాలను వదిలిపెట్టి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకమైనదన్నారు. 1200లకు పైగా వైద్యశిబిరాల ద్వారా 80లక్షలకు పైగా రోగులకు చికిత్స అందించడం ఒక రికార్డు అని తెలిపారు. వైద్యులు రిటైరైన తర్వాత మళ్లీ భర్తీ చేయాలంటే గతంలో ప్రహసనంగా ఉండేదని, కానీ ఇప్పుడు ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రభుత్వం పోస్టులు భర్తీ చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చేశామన్నారు. మొన్నటి వరకు 1200 పోస్టుగాడ్యుయేట్ సీట్లు ఉండేవని, ఈ ప్రభుత్వం వచ్చాక 650 పీజీ సీట్లు సాధించామన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడుతూ వైద్యరంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యత ఇచ్చిందని, ఇందులో భాగంగా ప్రతి పార్లమెంట్‌కు ఒక వైద్యకళాశాల ఏర్పాటు చేసిందన్నారు. కర్నూలు సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, ఇందులో భాగంగా అవసరమైన మౌళిక సదుపాయాలు, మందులు, పోస్టుల భర్తీకి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అనంతరం వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. చివరిగా విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ చిట్టినర్సమ్మ పాల్గొన్నారు.



బంగారు పతకాలు సాధించిన వైద్య విద్యార్థినులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నేటి నుంచి వాలీబాల్, చెస్ టోర్నీ

కర్నూలు (టౌన్): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల వాలీబాల్, చెస్ టోర్నమెంట్‌ను నేడు, రేపు (ఆది, సోమవారాలు) స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ క్రీడల కార్యదర్శి డాక్టర్ కేవీ శివ కిషోర్, నిర్వహణ కార్యదర్శి డాక్టర్ వై. కళ్యాణ్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

పేకాట స్థావరంపై దాడి

- 12 మంది అరెస్ట్
- రూ. 8.23 లక్షలు నగదు స్వాధీనం

మహానంది: నందిపల్లె గ్రామ సమీపంలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది దాడులు నిర్వహించారు. పేకాటాడుతున్న 12 మందిని అరెస్ట్ చేయడంతో పాటు భారీగా రూ. 8,23,900 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. అలాగే కారు, బైకు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.